పేదల పక్షపాతి సీఎం జగన్

ఏలూరులో కొత్త పింఛన్ల పంపిణీ


ఏలూరు 7వ డివిజన్‌లో 110 ఏళ్ల చోటీ బీకి పింఛన్ పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు శ్రీలక్ష్మి, శ్రీదేవి


13వ డివిజన్‌లో టీడీపీ నాయకురాలి తల్లికి పింఛన్ అందజేస్తున్న నాయకుడు ఎన్.నరేంద్ర


రాణీనగర్‌లో కొత్త పెన్షన్లు పంపిణీ చేస్తున్న కో ఆప్షన్ సభ్యుడు మున్నుల జాన్ గురునాథ్


18వ డివిజన్‌లో కొత్త పెన్షన్లు అందజేస్తున్న పార్టీ ఇన్‌చార్జి ఇనపనూరి జగదీష్

ఏలూరు టౌన్: కులం చూడం... మతం చూడం... ప్రాంతం చూడం... రాజకీయ పార్టీలు చూడకుండా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన హామీని పక్కాగా అమలు చేసి చూపిస్తున్నారు. గత టీడీపీ పాలనలో పెన్షన్ రావాలంటే పింఛన్‌దారుడు ఎవరైనా చనిపోతే వారి స్థానంలో మరొకరికి అవకాశం కల్పించే దౌర్భాగ్యస్థితి ఉండేది. కానీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తన సంక్షేమ పాలనలో అర్హులైన ప్రతి అవ్వాతాతకు పింఛన్ కంచన్‌గా అందజేస్తూ వారి ఆశీస్సులు అందుకుంటున్నారు. ఏలూరు నగరంలో సెప్టెంబర్ 1న కొత్త పెన్షన్ల వేడుకలు జరుపుకున్నారు. ఏలూరు ఎమ్మెల్యే ఆళ్లనాని ఆధ్వర్యాన నగరంలో వందలాది మందికి కొత్తగా పెన్షన్లు మంజూరు కావటం విశేషం.

శతాధిక వృద్ధురాలికి పింఛన్

ఏలూరు వన్‌టౌన్ 7వ డివిజన్‌లో కార్పొరేటర్ పిల్లంగోళ్ళ శ్రీదేవి, రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ళ శ్రీలక్ష్మి కలిసి డివిజన్‌లోని వృద్ధులకు కొత్త పెన్షన్లు అందజేశారు. 110 సంవత్సరాల శతాధిక వృద్ధురాలు చోటీ బీ అనే అవ్వకు వారిద్దరూ కలిసి పింఛన్ అందజేశారు.

పార్టీలకు అతీతంగా..

ఏలూరు 13వ డివిజన్‌లో ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. గత కార్పొరేషన్ ఎన్నికల్లో టీడీపీ కార్పొరేటర్‌గా పోటీ చేసిన అభ్యర్థి తల్లికి పెన్షన్ మంజూరు చేశారు. వైఎస్సార్ సీపీ యువజన నాయకులు, డివిజన్ ఇన్‌చార్జి నిడికొండ నరేంద్ర చేతులమీదుగా ఆమెకు పింఛన్ సొమ్ము అందజేయటం విశేషం. రాజకీయాలు, పార్టీలు చూడకుండా సంక్షేమం అందజేస్తున్నామని చెప్పేందుకు నిదర్శనంగా నిలుస్తోంది.

వృద్ధులకు ఆసరాగా..

ఏలూరు టూటౌన్‌లోని రాణినగర్ 10వ సచివాలయ పరిధిలో కొత్తగా మంజూరైన పెన్షన్లను నగరపాలక సంస్థ కో ఆప్షన్ సభ్యుడు మున్నుల జాన్‌గురునాథ్ చేతులమీదుగా అందజేశారు. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పేదల పక్షపాతిగా నిరూపించుకుంటూ వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు అండగా నిలుస్తున్నారని ఆయన తెలిపారు.

కొత్తగా 30 మందికి పెన్షన్లు

ఏలూరు 18వ డివిజన్‌లో ఏలూరు ఎమ్మెల్యే ఆళ్లనాని ఆదేశాలతో కొత్త పెన్షన్లు డివిజన్ ఇన్‌చార్జి ఇనపనూరి జగదీష్, కార్పొరేటర్ కేదారేశ్వరి అందజేశారు. 30 మందికి పెన్షన్లు మంజూరయ్యాయి.

క్లుప్తంగా

6న ఆలయ దక్షిణ రాజగోపురం ప్రారంభం


శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానానికి దక్షిణం వైపు నిర్మించిన రాజగోపురం

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : స్థానిక రామచంద్రరావు పేటలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఇటీవల నూతనంగా చేపట్టిన దక్షిణ రాజగోపుర నిర్మాణం పూర్తయిందని దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ తోలేటి శ్రీనివాస్, కార్యనిర్వహణాధికారి నాగం సన్యాసిరావు తెలిపారు. ఈ గోపురాన్ని ఈనెల 6వ తేదీ ఉదయం 10.35 గంటలకు ఎమ్మెల్యే ఆళ్ళ నాని ప్రారంభిస్తారని తెలిపారు. కార్యక్రమంలో నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు, 33వ డివిజన్ కార్పొరేటర్ కత్తిరి రామ్మోహనరావు అతిథులుగా పాల్గొంటారని చెప్పారు.

ఏలూరు ఎంఈఓగా రవిప్రకాష్


రవిప్రకాష్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఏలూరు రూరల్: ఏలూరు మండల విద్యాశాఖాధికారి – 1గా ఎ.రవిప్రకాష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జిగా ఆర్.రంగయ్య ఎంఈఓ – 2 వ్యవహరిస్తున్నారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నంబూరి రాంబాబు, ఏలూరు మండల శాఖ అధ్యక్షుడు పాటూరి సురేష్‌బాబుతో పాటు పలువురు ఉపాధ్యాయులు రవిప్రకాష్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించి పరిష్కరించాలని కోరారు. దీనిపై స్పందించిన ఎంఈఓ పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

సీఎం జగన్ పేదల పెన్నిధి


లబ్ధిదారుకు కొత్త పింఛన్ అందిస్తున్న కార్పొరేటర్ తంగెళ్ల రాము

ఏలూరు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పేదల పెన్నిధి అని 15 డివిజన్ కార్పొరేటర్ తంగెళ్ల రాము కొనియాడారు. శుక్రవారం డివిజన్‌లో వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు కొత్తగా మంజూరైన పింఛన్ల పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ బడుగు, బలహీన వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు నిరంతరంగా అమలు చేస్తూ పేదల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. ఎమ్మెల్యే ఆళ్ళ నాని ఆదేశాల మేరకు అర్హత కల్గిన ప్రతి ఒక్కరికీ అధికారులు కొత్త పింఛన్లు మంజూరు చేశారన్నారు. కొత్త పింఛన్‌దారులు ఎలాంటి అవస్థలు పడకుండా ఇంటి వద్దే పెన్షన్ అందుకోవడం సంతోషం కల్గిస్తుందన్నారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు ఎలగ అన్నవరం, దెక్కత జయరామిరెడ్డి, ఈపిజర్ల మణిరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు గణపవరంలో వైఎస్సార్ విగ్రహావిష్కరణ

గణపవరం: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా ఈనెల 2వతేదీ శనివారం ఉదయం 8.30 గంటలకు గణపవరం సంతమార్కెట్ వద్ద ఏర్పాటు చేసిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహాన్ని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ఆవిష్కరిస్తారు. అనంతరం వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాల్లో వాసుబాబు పాల్గొంటారు.

పరిసరాల పరిశుభ్రతతో దోమల నిర్మూలన


మాదేపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఏలూరు రూరల్: పరిసరాల పరిశుభ్రతతో దోమలను నిర్మూలించవచ్చని జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు అన్నారు. శుక్రవారం ఏలూరు మండలం మాదేపల్లిలో గుడివాకలంక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యాన వైద్య సిబ్బంది క్లీన్ మాదేపల్లి – గ్రీన్ మాదేపల్లి పేరుతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెంగీ, మలేరియా కారక దోమలు నివాసాల్లోని ఖాళీ స్థలాలు, మంచినీటి నిల్వ ప్రాంతాల్లో ఉంటాయన్నారు. వీటిలో ఆడ దోమలు మరింత ప్రమాకరం అన్నారు. జ్వర పీడితులు అశ్రద్ధ చేయకుండా స్థానిక వైద్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. డాక్టర్ ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో ఎంపీహెచ్ఈఓ ఉమామహేశ్వరరావు, హెల్త్ సూపర్‌వైజర్ శేషావతారం, నాగ మల్లేశ్వరరావు, ప్రసాద్ తదితరులు పాల్గొని కరపత్రాలు పంపిణీ చేశారు.

నాడు-నేడు పనుల పరిశీలన

దెందులూరు: ఉంగ్రాజవరం ప్రాథమిక పాఠశాలలో నాడు-నేడు పనులను ఎంఈవో ఏవీఎస్‌వీ ప్రసాద్ తనిఖీ చేశారు. పనులను వేగవంతం చేయాలని, నాణ్యతా ప్రమాణాలు పాటించి, ప్రభుత్వ లక్ష్యాలు అధిగమించాలని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీలను కోరారు.

సచివాలయ వ్యవస్థతో గ్రామస్వరాజ్యం

- ఏలూరు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ఆళ్లనాని
- 9వ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం


ఏలూరు 9వ డివిజన్‌లో మహిళకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే ఆళ్లనాని

ఏలూరు టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో గ్రామస్వరాజ్యానికి బాటలు వేశారని, సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేయటం ద్వారా ప్రభుత్వ పాలనను ఊరిలోకే తీసుకువచ్చారని ఏలూరు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ఆళ్లనాని చెప్పారు. శుక్రవారం ఏలూరు నగరంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం 111వ రోజూ కొనసాగింది. వన్‌టౌన్‌లోని 9వ డివిజన్ కార్పొరేటర్ సబ్బన శ్రీనివాస్ ఆధ్వర్యాన ఎమ్మెల్యే నానికి ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఏ విధంగా అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. అవ్వాతాతలకు పింఛన్ సక్రమంగా అందుతుందా లేదా ఆరా తీశారు. ఎవరైనా ఇబ్బంది కలిగిస్తే తమకు సమాచారం ఇవ్వాలని, వెంటనే చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే నాని చెప్పారు. ఏదైనా సాంకేతిక లోపంతో పథకాలకు దూరమైతే వాటిని సరిచేసి అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు చేరువ చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలకు పాలనను చేరువ చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని, సచివాలయ వ్యవస్థ, వలంటీర్లను నియమించి పారదర్శక పాలనకు నాంది పలికారని తెలిపారు. గతంలో టీడీపీ హయాంలో ఎవరైనా చనిపోతేనే మరొకరికి పింఛన్ లభించే పరిస్థితి ఉండేదని, కానీ నేడు అర్హులైన ప్రతి అవ్వాతాతకు పింఛన్ అందిస్తున్నామని చెప్పారు. ప్రతి నెలా 1న తెల్లవారుజామునే వలంటీర్లు తలుపుతట్టి మరీ చేతిలో పింఛన్ సొమ్ము పెడుతున్నారని గుర్తు చేశారు. దేశంలోనే ఏ రాష్ట్రంలోనూ ఇలాంటి పరిస్థితి లేదన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు సైతం ఎలాంటి అవినీతి, అవకతవకలు లేకుండా నేరుగా లబ్ధిదారులకే అందిస్తోన్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్‌బాబు, హిస్టరీ అకాడమీ డైరెక్టర్ ఎండీ కైసర్, కార్పొరేటర్ సుంకర చంద్రశేఖర్, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్, పార్టీ నాయకులు లంకలపల్లి గణేష్, తహసీల్దార్ సోమశేఖర్, అసిస్టెంట్ కమిషనర్ బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

సాఫీగా ఖరీఫ్ సాగు

- ఏలూరు మండలంలో 7,762 వేల ఎకరాల్లో వరి సాగు
- సబ్సిడీపై రైతులకు విత్తనాలు


కొమడవోలులో వరి చేనులో కలుపు తీస్తున్న కూలీలు

ఏలూరు రూరల్: ఏలూరు మండల గ్రామాల్లో రైతులు 7 వేల ఎకరాల్లో వరి నాట్లు పూర్తి చేశారు. కృష్ణా, గోదావరి కాలువకు ఏలూరు మండల గ్రామాలు శివారున ఉండటంతో ఏటా ఖరీఫ్‌లో వ్యవసాయ పనులు ఆగస్టు నెలాఖరు వరకు సాగుతున్నాయి. ఆగస్టు రెండో వారం నుంచి ఇరిగేషన్ అధికారులు కృష్ణా, గోదావరి కెనాల్ నుంచి సాగునీరు పుష్కలంగా విడుదల చేయడంతో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. పోణంగి, వెంకటాపురం, జాలిపూడి, చాటపర్రు, మాదేపల్లి, మెరకకాట్లంపూడి, పల్లపు కాట్లంపూడి, తిమ్మారావుగూడెం, చొదిమెళ్ల రైతులు కృష్ణా కెనాల్ నీటితో సుమారు 7,000 ఎకరాల్లో నాట్లు వేశారు.

ఖరీఫ్‌లో పెరిగిన సాగు

రబీ కన్నా ఖరీఫ్‌లో మరో 2,700 ఎకరాల్లో వరి సాగు పెరిగిందని అధికారులు భావిస్తున్నారు. రబీలో సాగునీరు లభ్యత లేకపోవడంతో అధికారుల సూచనల మేరకు రైతులు 6,223 ఎకరాల్లో వరితో పాటు అపరాలు సాగు చేసిన సంగతి తెలిసిందే. ఇందులో చాటపర్రు, మాదేపల్లి, కాట్లంపూడి, జాలిపూడి ప్రాంతాల రైతులు 4,549 ఎకరాల్లో అపరాలు పండించారు. వెంకటాపురం, చొదిమెళ్ల, తంగెళ్లమూడి, సత్రంపాడులో బోర్ల కింద 1,674 ఎకరాల్లో మాత్రమే వరి సాగు జరిగింది. ఇప్పుడు అన్ని గ్రామాల రైతులు 100 శాతం నాట్లు పూర్తి చేశారు.

సబ్సిడీపై విత్తనాలు

ప్రభుత్వం ఆర్‌బీకేల ద్వారా రైతులకు సబ్సిడీపై విత్తనాలు అందిస్తోంది. కేజీకి రూ.5లు చొప్పున సబ్సిడీ పొందుతూ 1061, 1318, స్వర్ణ రకాల విత్తనాలు తీసుకుంటున్నారు. ఈ ఏడాది రబీలో 133 మంది రైతులు 11.81 లక్షలు ఖరీదు గల విత్తనాలను ప్రభుత్వం నుంచి కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే. దీని ద్వారా 133 మంది రైతులు లక్షలాది రూపాయలు సబ్సిడీ పొందారు. దీనికి తోడు సేంద్రియ సాగువైపు రైతులు దృష్టి సాగించేందుకు అధికారులు సబ్సిడీపై సేంద్రియ ఎరువులు అందిస్తున్నారు.

సాగునీరు అందింది



ప్రభుత్వం సాగునీరు పుష్కలంగా అందించింది. విత్తనాలు కొన్నాం. నారు పోసాం. ఎక్కడా ఇబ్బందులు లేకుండా నాలాగే రైతులు అందరం నాట్లు వేశాం. ప్రభుత్వ సహకారం ఇలానే కొనసాగితే ఎకరానికి 45 బస్తాలు పండిస్తాం. మధ్య మధ్యలో అడపా దడపా వర్షాలు కురిస్తే బాగుంటుంది. లేని పక్షంలో అధికారులు మరింత శ్రద్ధతో నీరు అందించాల్సి ఉంటుంది.

– జి.దుర్గారావు, రైతు, చాటపర్రు

సబ్సిడీపై విత్తనాలు సిద్ధం



ఈ ఏడాది ఖరీఫ్‌లో 8 వేల నుంచి 9 వేల ఎకరాల్లో వరిసాగు చేపట్టేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. వీరికి అందించేందుకు 1061, 1318, స్వర్ణ విత్తనాలు సిద్ధం చేసాం. కేజీకి రూ.5లు చొప్పున రైతులకు సబ్సిడీ వస్తుంది. సేంద్రియ ఎరువులు సైతం అందిస్తాం.

– ఎ.జీవనసంధ్య, ఎంఏఓ

ప్రైవేటీకరణపై పోరాటాలకు సిద్ధం కావాలి


ఏలూరులో ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

ఏలూరు (టూటౌన్): ఏపీ బేవరేజ్ హమాలీ కార్మికులను నాల్గో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని ఐఎఫ్‌టీయూ(ఇఫ్టూ) ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు కోరారు. ఇఫ్టూ జాతీయ కమిటీ పిలుపులో భాగంగా శుక్రవారం స్థానిక పెద్ద రైల్వే స్టేషన్ సమీపంలోని ఐఎంఎల్ గోడౌన్ వద్ద కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ బీజేపీ సర్కార్ దేశంలో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తోందన్నారు. ప్రజల సంపదను అదాని, అంబానీలకు కారు చౌకగా అమ్మేస్తోందన్నారు. ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా కార్మిక వర్గం సమరశీల ఉద్యమాలకు సిద్ధం కావాలన్నారు. ఏపీ బేవరేజ్ హమాలీ కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ వంటి చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని కోరారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలను పరిరక్షించాలని, ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న హమాలీ కార్మికులకు ఉపాధి భద్రతతో కూడిన చట్టం చేయాలని కోరారు. కార్యక్రమంలో గంగాధర్, వై.శ్రీను, జి.భాస్కరరావు, జి.శ్రీను, కె.సూర్యనారాయణ, ఇ.నాగరాజు, ఎల్.మురళి, పి.కోటేశ్వరరావు, టి.శివ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల ధరలను తగ్గించాలి


మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు కిషోర్

ఏలూరు (టూటౌన్): నిత్యావసర సరుకుల ధరలను తగ్గించాలని సీపీఎం ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్ కోరారు. పార్టీ చేపట్టిన ప్రచార భేరి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఏలూరులోని పడమర వీధి, రామకృష్ణాపురం, పోస్టల్ కాలనీ, శనివారపు పేట, శాంతినగర్, సత్రంపాడు ప్రాంతాల్లో సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ నిత్యావసర సరుకుల ధరలను తగ్గించాలని కోరుతూ ఈనెల 4న ఏలూరు మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రతిపక్ష పార్టీల ఆందోళనలు, త్వరలో జరగబోయే ఐదు రాష్ట్రాల ఎన్నికల నేపథ్యంలో కేంద్రం గ్యాస్ సిలిండర్‌పై రూ.200 తగ్గించిందన్నారు. బీజేపీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే పెట్రోల్, డీజిల్ రూ.50, రూ.60లకు గ్యాస్ రూ.400లకు అందించాలని కోరారు. పెరిగిన ధరలపై దేశ వ్యాప్తంగా ప్రజలు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పి.ఆదిశేషు, వి.సాయిబాబు, బి.జగన్నాధరావు, కె.రామాంజనేయులు, జి.రవికిషోర్, ఎం.ఇస్సాక్, ఎం.శ్రీనివాసరావు, ఎస్.సత్యనారాయణ, జి.కోటేశ్వరరావు, జి.ఏసుబాబు, సి.బాలరాజు, పి.జోగినాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు మెగా వైద్యశిబిరం

నిడమర్రు: మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో శనివారం దివంగత సీఎం వైఎస్ రాజశేఖర రెడ్డి వర్ధంతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ సంకు సత్యకుమార్ తెలిపారు. ఉదయం 9గంటలకు బువ్వనపల్లిలోని వైఎస్సార్ విగ్రహం వద్ద, పెదనింద్రకొలనులో పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా వైద్యశిబిరంలో ఎమ్మెల్యే వాసుబాబు పాల్గొంటారన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి

పెదపాడు: పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ పెదపాడు గ్రామ సచివాలయం వద్ద సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేఖ విధానాలు నశించాలంటూ నినాదాలు చేశారు. జిల్లా కమిటీ సభ్యుడు కె.శ్రీనివాస్, నాయకులు షేక్ కరీముల్లా, గుండపనేని సరేష్, రెడ్డి లక్ష్మణరావు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర		
టమాటాలు	24	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	50
వంకాయలు (కాంతులు)	32	చామదుంపలు	40
వంకాయలు (తెలుపు)	38	ములక్కాడలు	05-08
బెండకాయలు	24	కంద	48
పచ్చిమిర్చి	28-36	బీట్‌రూట్	36
కాకర కాయలు	32-44	కీరా దోస	30
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	72
క్యాబేజీ	24	అల్లం	120-220
క్యారెట్	36	కొత్తిమీర (కట్ట)	17
దొండకాయలు	28	పాలకూర	10
బంగాళదుంపలు	26	చుక్కకూర	10
ఉల్లిపాయలు	30	తోటకూర	10
గోరుచిక్కుడు	34	గోంగూర	07
దోసకాయలు	24-34	పుదీనా	05
ఆనబకాయ (1)	15-20	క్యాప్సికమ్	60
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	40
		నిమ్మకాయలు (డజను)	12-18

ఏలూరులో నా భూమి - నా దేశం


మొక్కలు నాటుతున్న బీజేపీ నాయకులు

ఏలూరు(ఆర్ఆర్ పేట): దేశంలోని అన్ని ప్రాంతాలు ఒక్కటే అనే భావనను ప్రజల్లో నింపడానికే ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నా భూమి – నా దేశం కార్యక్రమాన్ని చేపట్టారని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు. శుక్రవారం స్థానిక కెనాల్ రోడ్డులోని గాంధీ స్కూల్‌లో పార్టీ ఏలూరు తూర్పు మండలాధ్యక్షుడు అనిల్ ఆచార్య ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమానికి భూపతిరాజు శ్రీనివాస వర్మ, ఏలూరు జిల్లా అధ్యక్షుడు కొరళ్ళ సుధాకర్ కృష్ణ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ప్రతి గ్రామంలో 75 మొక్కలు నాటడం, సామాజిక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏలూరు అసెంబ్లీ కన్వీనర్, కో-కన్వీనర్‌లు గాది రాంబాబు, బాడిత నారాయణరావు, సీనియర్ నాయకులు ముద్దాని దుర్గారావు, నెరుసు నెలరాజు, పసుపులేటి మనోహర్ ప్రసాద్ పాల్గొన్నారు.

పంచాయతీ విధులు, పరిపాలన అంశాల పరిశీలన


భీమడోలు పంచాయతీలో పలు అంశాలపై వివరాలు సేకరిస్తున్న ట్రైనీ కలెక్టర్ పూజ

భీమడోలు: భీమడోలు గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ట్రైనీ కలెక్టర్ పూజ సందర్శించారు. నాలుగు రోజుల క్షేత్ర పర్యటనలో భాగంగా భీమడోలు మొదటి రోజైన శుక్రవారం గ్రామ పంచాయతీని సందర్శించిన ఆమె పంచాయతీ కార్యదర్శి ఎస్.ఠాగూర్ పలు అంశాలను వివరించారు. గ్రామ కార్యదర్శి విధులు, పరిపాలన, పంచాయతీ నిర్వహణ, నిధులు, వాటి వినియోగం, సమావేశాలు, ఆదాయ, వ్యయాలు, ఎన్నికలు వాటి నిర్వహణ తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకేలు, ఆసుపత్రులు, పారిశుధ్య నిర్వహణ, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం తదితర విషయాలపై ఆమె క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. పంచాయతీలు ఆదాయాన్ని పెంచుకునేందుకు తీసుకునేందుకు తీసుకుంటున్న చర్యలపై ఆరా తీసారు. తొలుత సర్పంచ్ పాము సునీతామాన్‌సింగ్ పుష్పగుచ్ఛం అందించి ట్రైనీ కలెక్టర్‌కు స్వాగతం పలికారు.